క్లుప్తంగా

రేపు ధనుర్మాస వన సమారాధన

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జేఎన్ రోడ్డు ఏకేసీ కళాశాల ఎదురుగా గల ప్రభు గారి తోటలో ధనుర్మాస వన సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షురాలు కొమండూరి సత్య శ్రీనివాస కుమారి, ప్రధాన కార్యదర్శి పరాంకుశం ప్రమీల శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు గోదాదేవి పూజ, 9 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణ, అనంతరం ప్రసాద వితరణ జరుగుతుంది. 11 గంటలకు సభ, 2024 క్యాలెండర్ ఆవిష్కరణ, అనంతరం తదియారాధన (భోజన కార్యక్రమం) జరుగుతుందన్నారు. విశిష్ట అతిథులుగా కేశవ హాస్పటల్, నీఒజీయర్ హాస్పటల్ అధినేత డాక్టర్ పరాంకుశం కేశవస్వామి, అఖిల భారత చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు టి.విజయలక్ష్మి, కేశవభట్ల ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కేశవభట్ల శ్రీనివాస్, ఏపీ హైకోర్ట్ అడ్వకేట్, జనవాహిని పార్టీ అధ్యక్షుడు డీఎస్ఎన్వీ ప్రసాద్ బాబు పాల్గొంటారన్నారు. సంఘీయులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: పాఠశాల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారుల పర్యటన ఉన్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల రికార్డుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు రోజులు వరసగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో అర్బన్ ఎంఈవో – 2 రమా రజని, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అయోధ్య అక్షతల పంపిణీ



వీరవరంలో అక్షతల ఊరేగింపులో పాల్గొన్న వీరభద్రయ్య తదితరులు

కడియం: అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని యజ్ఞ అక్షతల వితరణ కార్యక్రమం మండలం శుక్రవారం వైభవంగా జరిగింది. వీరవరం, కడియపులంక తదితర గ్రామాల్లో పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ప్రతి ఇంటికి వెళ్లి యజ్ఞ అక్షతలను బొట్టుపెట్టి అందజేశారు. వీరవరం కోదండ రామాలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, స్థానిక నాయకులు బత్తుల రాము, రేమళ్ల ప్రసాద్, ఆదిమూలం సాయి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట రామిరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయం దివ్యాంగజన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (230/2023) 2024 సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దివ్యాంగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.అశ్వర్థ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి కాశీవిశ్వనాథ్, వైస్ ప్రెసిడెంట్ తన్నీరు రామాంజనేయులు, అదనపు కార్యదర్శి ప్రత్తిపాటి ప్రేమ సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ నాగభూషణరావు, ట్రెజరర్ వల్లూరు వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టంరాజు రవిమాధవ్, కార్యవర్గ సభ్యుల పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ సహకారంతో సచివాలయ దివ్యాంగుల సమస్యలను కాకర్ల వెంకట రామిరెడ్డికి విన్నవించామని తన్నీరు రామాంజనేయులు తెలిపారు.

టీచర్ నాగమణికి సత్కారం

కడియం: ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయురాలు వై.నాగమణిని ఎంఈవో వి.లజపతిరాయ్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. సావిత్రీ బాయి పూలే జయంత్యుత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఎంఈవో మాట్లాడుతూ సావిత్రీ బాయి స్ఫూర్తితో ఉపాధ్యాయులు సేవలందించాలన్నారు.





ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

తెలుగు సోయగం.. కనుల వైభవం

- గైట్‌లో తెలుగు మహాసభలు ప్రారంభం
- ఆకట్టుకున్న సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు



వేదికపై చత్తీస్‌గఢ్ గవర్నర్ హరిచందన్, స్వరూపానందేంద్ర స్వామీజీ తదితరులు

రాజానగరం: తెలుగు ఔన్నత్యాన్ని, ఆవశ్యకతను తెలియజేస్తూ రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలకు నీరాజనంగా, నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గైట్ కళాశాల ప్రాంగణంలో మూడు రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే ప్రాంగణంలో మరోవైపు ఐదు రోజులు నిర్వహించేలా ఇప్పటికే ప్రారంభమైన చతుర్వేద మహాయాగం, శ్రీవారి వైభవోత్సవాలకు ఈ మహాసభలు కూడా తోడయ్యాయి. దీనితో గైట్ కళాశాల ప్రాంగణంలో ఒకవైపు తెలుగు భాషా ఔన్నత్యాన్ని తెలియజేసేలా నిర్వహిస్తున్న సభలు, వక్తల ప్రసంగాలు, మరోవైపు భగవన్నామ స్మరణతో కూడా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆద్యాంతం ఆహ్లాదకరంగా, శోభాయమానంగా సాగుతున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమూనా తిరుమలేశుని సెట్‌లో శ్రీనివాసుని దర్శించుకునే వారు కొందరైతే, తెలుగు భాష వేదికలపై ఉపన్యాసాలు, ప్రదర్శనలు ఇచ్చేవారు మరికొందరు. వీటన్నిటినీ వీక్షించి, విజ్ఞానం, వినోదాలను పొందేందుకు వచ్చే వారితో ఆ ప్రాంగణం జాతరను తలపిస్తోంది.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అంతర్జాతీయ తెలుగు మహా సభల సందర్భంగా ప్రధాన వేదికపై రాజమహేంద్రరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థుల జానపద నృత్యంతో ప్రారంభమైన ఈ ప్రదర్శనలు ఒకరిని మించి మరొకరు అన్నట్టుగా పోటాపోటీగా సాగాయి.

స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు ఘట్టం, సంక్రాంతి సంబరాలు, దాండియా నృత్యం, గొబ్బెమ్మల నృత్యాలతో అబ్బురపరిచారు. అలాగే ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు కూడా నువ్వానేనా అన్నట్టుగా మామ బంగారు అనే జానపద నృత్యంతో గ్యాలరీలో ఉన్న విద్యార్థులను కేరింతలు కొట్టించారు. వేదంలా ఘోషించే గోదావరి అంటూ గోదావరి అందాలు, రాజరాజనరేంద్రుడు, ఆదికవి నన్నయ, వీరేశలింగం తదితర ప్రముఖుల గురించి నృత్య రూపంగా తెలియజేశారు. బుర్రకథ ద్వారా గంగావతరణ గురించి వివరించారు. ఇలా అనేక ప్రదర్శనలతో విద్యార్థులు అందరినీ అబ్బురపరిచారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో రహదారులను శరవేగంగా అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. జేఎన్ రోడ్డు నుంచి ఏవీఏ రోడ్డు వరకూ రూ.1.96 కోట్లతో 1.3 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా తీర్చిదిద్దాలి

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నగర పాలక సంస్థ శానిటరీ అధికారులు, సిబ్బంది సహకరించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో వారితో సమీక్షించారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓ వినూత్నకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె, పరిష్కారం అనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయమని, వీరి సమ్మె వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిగా తనపై ఉందన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

ధవళేశ్వరం: స్థానిక అంకాలమ్మ గుడి సెంటర్‌లో పునర్నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త ఎస్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జగన్ అంటే నమ్మకం, భరోసా

- ఎంపీ భరత్ రామ్
- లబ్ధిదారులకు పెంచిన పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంటే ఒక నమ్మకం, భరోసా అని ఎంపీ, సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.3 వేలకు పెంచారన్నారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.3 వేలు పెన్షన్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగన్ ఇచ్చిన మాట కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా నెరవేర్చే వరకూ విశ్రమించరన్నారు. పెన్షన్ రూ.3 వేలకు పెంచి ముందుగానే సంక్రాంతి సంబరాలు జగనన్న తీసుకొచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్లకు నెలకు కేవలం రూ.400 కోట్లు మాత్రమే వెచ్చిస్తే, సీఎం జగనన్న 65 లక్షల మందికి నెలకు రూ.2 వేల కోట్లుపైన కేటాయిస్తున్నారన్నారు. నగరంలోనే మూడు లక్షల మంది జనాభా ఉంటే, 29,700 మందికి పెన్షన్లు అందిస్తున్నామని, గత ప్రభుత్వంలో 16 వేలకు మాత్రమే అందేవన్నారు. చంద్రబాబు సీఎం అయితే సంక్షేమ పథకాలేవీ ఉండవన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న సీఎం జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు. అర్బన్ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే మీ ఇంటి పెద్ద కొడుకుగా బాధ్యతలన్నీ మోస్తానన్నారు. ప్రశాంతమైన నగరంలో అలజడులు, ఆందోళనలకు కారణమైన అసాంఘిక శక్తులను ప్రోత్సహించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవద్దన్నారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లను పెంచి పోషించే ఎవ్వరినీ నమ్మవద్దని, రాజకీయ ముసుగులో వడ్డీ వ్యాపారాలు చేస్తూ ప్రజలను పీడించుకు తినేవారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు వంకా రవీంద్రనాథ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

నగరంలో త్వరితగతిన అభివృద్ధి పనులు

ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడకుండా త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, నగర పాలక అధికారులు, సిబ్బందికి ఎంపీ మార్గాని భరత్ రామ్ సూచించారు. స్థానిక 35వ వార్డు దేవీచౌక్ వద్ద నుంచి శుక్రవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. కోర్లమ్మ పేట పరిధిలోని నాలుగు వీధులు, తుమ్మలావ, రజకుల వీధి, అక్కడ నుంచి మెయిన్ రోడ్డు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకూ ఎంపీ భరత్ రామ్ పర్యటించారు. దేవీచౌక్ వద్ద ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. చెత్తను డంప్ చేసే పాయింట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, అదే విధంగా డంపింగ్ పాయింట్‌ను మరోచోటకు మార్చాలని సూచించారు. ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. నగరంలోని 35, 36 వార్డులలో ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, వార్డు ఇన్‌చార్జి ప్రసాదుల హరినాథ్, 32, 36 వార్డుల ఇన్‌చార్జులు కేబుల్ శ్రీను, నందం స్వామి పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా మంత్రి వేణు బాధ్యతల స్వీకరణ

- రాయుడుపాకలు గ్రామంలో వినాయకునికి పూజలు
- పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



వినాయకునికి పూజలు చేస్తున్న మంత్రి వేణు, చిత్రంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. రాయుడుపాకలు గ్రామంలోని వినాయకుని ఆలయంలో శుక్రవారం సాయంత్రం 5.49 గంటలకు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడిరాజా, మంత్రి కుమారులు నరేన్, ఉమా శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రాయుడుపాకలు గ్రామపెద్దలు ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..

కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన మంత్రి వేణు శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.





జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీజీఅండ్ బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న మంత్రి వేణు

ఘనంగా హితవాక్యం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న రఘునాథశర్మ తదితరులు

సీటీఆర్ఐ: ఇచ్చకాలు అన్నీ హితవాక్యాలు కావని, హితానికి, ఇచ్చకానికీ మధ్యనున్న సున్నితమైన సరిహద్దు తెలుసుకోవాలని మహా మహోపాధ్యాయ శలాక రఘునాథ శర్మ అన్నారు. సాహితీవేత్త వారణాసి సుబ్రహ్మణ్యం రచించిన హితవాక్యం పుస్తకావిష్కరణ శుక్రవారం ఆదిత్య కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రఘునాథశర్మ మాట్లాడుతూ లౌకిక, పారలౌకిక, పారమార్థిక సత్యాలను తెలుసుకోవడానికి రామాయణ, భారత, భాగవతాలను ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. వారణాసి సుబ్రహ్మణ్యం గతంలో రచించిన పుస్తకాలు చాలా సరళంగా, అందరికీ అర్థమయ్యేరీతిలో ఉన్నాయన్నారు. అదే విధంగా హితవాక్యం కూడా సులభతరంగా అందరికీ అర్థమవుతుందన్నారు. తొలి ప్రతిని స్వీకరించిన సాహితీ గౌతమి వ్యవస్థాపకుడు పి.విజయ కుమార్ మాట్లాడుతూ భావ వ్యక్తీకరణకు, వ్యక్తిత్వ వికాసానికి రామాయణం ఉపకరిస్తుందన్నారు. అధ్యక్షత వహించిన డాక్టర్ బులుసు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నేటి యువత రామాయణ, భారత, భాగవతాలను చదవడంలో అశ్రద్ధ వహిస్తున్నారన్నారు. ఆదిత్య విద్యాసంస్థల సంచాలకుడు గంగిరెడ్డి, ఎస్‌కేఆర్ డీఎడ్ మహిళ కళాశాల తెలుగు శాఖాధిపతి విశాలాక్షి మాట్లాడుతూ హితవాక్యం పుస్తకం యువతకు ఉపకరిస్తుందన్నారు. ఆదిత్య కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ బీవీ రమాదేవి గ్రంథ సమీక్ష నిర్వహించారు. అనంతరం పుస్తకాన్ని ఆవిష్కరించిన శలాక రఘునాథశర్మను, రచయిత వారణాసి సుబ్రహ్మణ్యాన్ని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, జోరా శర్మ, ముంగండ సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు



వెంకటనగరం సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాలని వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. వెంకట నగరం గ్రామ సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును సచివాలయ కన్వీనర్లతో కలిసి ఆవిష్కరించి, అనంతరం పార్టీ పతాకాన్ని ఎగుర వేశారు. పార్టీ శ్రేణులతో కలిసి మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. తాటికొండ విష్ణుమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధిని రెండుకళ్లలా భావించి పాలన సాగించారన్నారు. పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి, సచివాలయ కన్వీనర్లు గంధ్రోతు విష్ణుమూర్తి, తలారి వెంకటేశ్వర్లు, దిడ్ల గీత, సొసైటీ అధ్యక్షులు కొల్లపు శ్రీను, దారా సంజీవయ్య, భీముడు, అశోక్ కుమార్, మోర్తా రమేష్, యెరుబండి సాయి పాల్గొన్నారు.

507 మందికి వైద్యసేవలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగదేవి

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామ సచివాలయం–2 పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్యశిబిరంలో 507 మందికి వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. కాతేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఈ.నాగదేవి, గైనకాలజిస్ట్ డాక్టర్ జె.వైష్ణవి, ఆర్థోపెడీషియన్ డాక్టర్ బాల, అప్తాలిజిస్ట్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి, సచివాలయ కన్వీనర్లు మంగం శేఖర్ బాబు, వేముదా సునీల్, మెప్పిలి రాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దండమూడి అర్జునరావు, దాసరి గోపాలకృష్ణ, మంగం రవీంద్ర, యడ్ల సురేష్, మంగం రాంబాబు, హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

సూర్యారాధనకు రాట ముహూర్తం



రాట ముహూర్తం చేస్తున్న కుమార్ శర్మ తదితరులు

సీటీఆర్ఐ: మాఘమాసం సందర్భంగా ఫిబ్రవరి 10 నుంచి 25వ తేదీ ఆదివారం వరకూ షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధన చేయాలని యాగ నిర్వాహకుడు వడలి కుమార్ శర్మ సంకల్పించారు. ఈ మేరకు యాగశాల ఏర్పాట్ల కోసం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు రాట ముహూర్తం చేశారు. స్థానిక పేపర్ మిల్ రోడ్డు సీతంపేటలోని యాగ స్థలంలో కుమార్ శర్మ దంపతులు పూజ నిర్వహించారు. కాలభైరవ స్వామి క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుల్లేవు ప్రసాద్, ఉప్పాడ కోటరెడ్డి, దూర్వాసుల సూర్యనారాయణ, సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



దుళ్ల హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

కడియం: మండలంలోని దుళ్ల హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం సంధ్యారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తాతపూడి బాబీ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఇటీవల నిర్వహించిన గణిత పోటీల్లో విజేతలుగా నిలిచిన 40 మంది విద్యార్థులు స్కూలు ఉపాధ్యాయులు ఫణికుమార్, గాంధీ తమ సొంత నిధులతో సమకూర్చిన క్యాంపస్ బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కంటిపూడి సాయి, వార్డు సభ్యులు పిచ్చుక చిన వెంకట్రావు, నామాల సుధాకర్, నాయకులు కాలెపు చెల్లారావు, బాల సరోజి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి



గౌతమ్‌రెడ్డిని కలిసిన ముద్దాల అను తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో కార్మికులను ఐక్యం చేస్తూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ రెడ్డి సూచించారు. శుక్రవారం రాజమహేంద్రవరం విచ్చేసిన ఆయనను ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, ఏపీ స్టేట్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, ట్రేడ్ యూనియన్ మాజీ జిల్లా అధ్యక్షుడు అడపా వెంకట రమణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ఏ కార్యకర్తకైనా పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రూరల్ మండలం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కామేశ్వరరావు, దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, కడప అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని డీమార్ట్ పక్కన ఉన్న గ్రౌండ్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రూరల్ మండలానికి సంబంధించిన నూతన పింఛన్లతో పాటు, పెంచిన పాత పింఛన్లను పంపిణీ చేస్తామని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పాల్గొంటారన్నారు.

10న బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పార్శిల్ కార్యాలయంలో వినియోగదారులు తీసుకువెళ్లని వస్తువులకు ఈనెల 10వ తేదీ బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్న అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ్ శుక్రవారం ప్రకటించారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లో పార్శిల్ ఆఫీస్ వద్ద వేలం జరుగుతుందన్నారు.

సారాతో మహిళ అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: క్వారీ మార్కెట్ ప్రాంతంలో సారా విక్రయిస్తున్న భీమన సూర్యకాంతాన్ని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. ఆమె నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సినిమాలు

శ్యామల	: డెవిల్
సూర్యమినీ	: ఆక్వామేన్
సూర్యప్యాలెస్	: యానిమల్
స్వామి	: హాయ్‌నాన్న
శివజ్యోతి	: మాయాబజార్
అనుశ్రీ	: డెవిల్
రాజా	: సలార్
అశోక	: సలార్
ఊర్వశి	: డెవిల్
రంభ	: బబుల్‌గమ్
మేనక	: ఆక్వామేన్
అప్సర	: కపాల దీవి
నామవరం	
వీఎస్ మహల్	: సలార్, డెవిల్
దవళేశ్వరం	
మురళీకృష్ణ	: డెవిల్
కడియం	
వెంకటసూర్య	: సలార్, డెవిల్